
# సాక్షి ఒడిశా

గురువారం । 13 । జూలై । 2023

### శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ. 3,46,186లు, బంగారం 1.6 గ్రాములు, వెండి 79.3 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



### మత్తుకు ముకుతాడు

- 527 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

- 8లో



### గుప్తేశ్వరం అభివృద్ధికి చర్యలు

- రూ.20 కోట్లు మంజూరు చేసిన రాష్ట్రప్రభుత్వం

- 8లో

## న్యూస్‌రీల్

### మునిగుడలో మంత్రి సరక పర్యటన



పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జగన్నాథ సరక

రాయగడ: రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక జిల్లాలోని మునిగుడలో బుధవారం పర్యటించారు. సమితిలోని దలియాకుజిలో సుమారు రూ.45 లక్షల వ్యయంతో నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం అదే గ్రామంలో రూ.10 లక్షల అంచనాలతో నిర్మాణం పూర్తిచేసిన మిషన్‌శక్తి భవనం, మునిగుడలో రూ.60 లక్షలతో నిర్మించిన బిజూ పట్నాయక్ కల్యాణ మండపాన్ని ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా నవీన్ సర్కార్ పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, బిజూ స్వాస్థ్య కల్యాణ సమితి ముఖ్య సలహాదారుడు సుధీర్ దాస్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎస్‌డీసీ) చైర్మన్ అనసూయ మాఝి, పృథ్వీరాజ్ సాహు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

### మావోయిస్టు అనుచరుల అరెస్ట్

రాయగడ: మావోయిస్టు కార్యకలాపాల్లో సహకరిస్తున్నారన్న అనుమానంతో జిల్లాలోని మునిగుడ పోలీసులు నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారిని మంగళవారం సాయంత్రం కోర్టులో హాజరు పరిచిన అనంతరం రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో మునిగుడ సమితి కద్రాపంగ గ్రామానికి చెందిన నువామాఝి కద్రక(32), పాటొరాణికి చెందిన రగిడి జగరంగ(45), బొడొడెంగుణి గ్రామానికి చెందిన బులి కొరొకొరియా(45), చంద్రపూర్ సమితి రునాఖాల్‌కు చెందిన పగుడా కింబకా(42)గా గుర్తించారు. కొద్ది రోజుల క్రితం మునిగుడ సమితిలో మావోయిస్టులు పాల్పడిన దుశ్చర్యలకు వీరు ప్రత్యక్షంగా సహకరించిన్నట్లు అందిన సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

### నకిలీ గుట్కా సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ గుట్కా బస్తాలు

బరంపురం: నగర శివారు లూచ్చాపడ–నిమ్మఖండి మార్గంలో నకిలీ గుట్కా రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. వాహనంపై బుధవారం దాడి చేసి, భారీగా గుట్కా, సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి కౌసిక్ మాఝి తెలిపిన సమాచారం ప్రకారం నిమ్మఖండి పోలీస్ ఔట్‌పోస్ట్ పరిధిలోని ఓ ఇంట్లో గత కొద్ది రోజులుగా నకిలీ గుట్కా తయారు చేస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు రవాణాకు సిద్ధంగా ఉంచిన వాహనంపై దాడి చేసి, గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నిందితుడిని అరెస్ట్ చేశారు.

### సాండిని బంధించిన మున్సిపల్ సిబ్బంది



సాండిని బంధిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: స్థానిక పట్టణంలో పశువులు, శునకాలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఓ సాండి పశువు మంగళవారం రాత్రి మహిళపై దాడి చేసి, గాయపరిచింది. దీనివల్ల ఆమె తీవ్రంగా గాయపడగా, స్థానికులు వెంటనే జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న జయపురం మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ జయపురం అగ్నిమాపక సిబ్బంది, పశుసంవర్ధకశాఖ వైద్యులకు సమాచారం అందించారు. మహిళను పొడిచిన సాండిని బంధించాలని కోరారు. ఈ మేరకు అతి కష్టంతో జీవాన్ని బంధించి, వాహనంలో గోశాలకు తరలించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆశాఖ వైద్యులు పరీక్షించిచారు. ఇదిలా ఉండగా పట్టణంలో వీరవిహారం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న శునకాలను సైతం బంధించాలని స్థానికులు కోరుతున్నారు.

# నిర్లక్ష్యంపై వేటు!



బహనాగా బజార్ రైల్వేస్టేషన్ వద్ద చెల్లా చెదురుగా పడి ఉన్న రైలు బోగీలు(ఫైల్)

- బహనాగా బజార్ ప్రమాదంపై రైల్వేశాఖ చర్యలు
- ఏడుగురు సిబ్బందిని విధుల నుంచి తొలగించిన అధికారులు
- నిందితులకు మరో 4రోజులు రిమాండ్ కొనసాగించిన సీబీఐ

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ రైల్వేస్టేషన్ సమీపంలో జూన్ 2న జరిగిన ఘోర రైలు ప్రమాదం నేపథ్యంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై ఏడుగురు ఉద్యోగులను రైల్వేశాఖ తొలగించింది. ఈ ప్రమాదంలో 294మంది ప్రాణాలు కోల్పోగా, దాదాపు 1,100 మందికి పైగా గాయపడ్డారు. ఈ మేరకు చేపట్టిన చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. వీరిలో ముగ్గురు ప్రస్తుతం సీబీఐ రిమాండ్‌లో ఉన్న ముగ్గురు ఎస్‌ఎండ్‌టీ అధికారులు కూడా ఉన్నారని ఆగ్నేయ రైల్వే జనరల్ మేనేజర్ అనీల్‌కుమార్ మిశ్రా తెలిపారు. వీరితో ప్రమాదానికి నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించిన సిబ్బందిగా గుర్తించిన బహనాగా బజార్ స్టేషన్ మాస్టర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, మెయింటైనర్లను సస్పెండు చేసినట్లు సమాచారం. బహనాగా బజార్, బాలాసోర్ రైల్వే స్టేషన్లను సౌత్‌ఈస్ట్ రైల్వే జీఎం, డీఆర్‌ఎం బుధవారం ప్రత్యక్షంగా సందర్శించారు. అనంతరం సిబ్బందికి వ్యతిరేకంగా చర్యలు చేపట్టారు. ఈ అధికారులు బాలాసోర్ ఎంపీ ప్రతాప్‌చంద్ర షడంగితో కలిసి గోపీనాథ్‌పూర్ రైల్వే స్టేషన్‌ను కూడా సందర్శించారు. ఈ సందర్భంగా బాలాసోర్–నీలగిరి సెక్షన్‌ను పర్యవేక్షించారు. సీబీఐ అరెస్ట్ చేసిన ముగ్గురు రైల్వే ఉద్యోగులు సీనియర్ సెక్షన్ ఇంజినీర్(సిగ్నల్), అరుణ్‌కుమార్ మహంత, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ మహ్మద్ అమీర్‌ఖాన్, టెక్నీషియన్ పప్పుకుమార్ లను మరో 4 రోజులు రిమాండ్ కొనసాగించారు. ఈ మేరకు సీబీఐ ప్రత్యేక కోర్టు నుంచి అనుమతి లభించింది.

**అప్రమత్తంగా ఉండి ఉంటే..!**

ఈ దుర్ఘటన పురస్కరించుకుని ఆగ్నేయ సర్కిల్ రైల్వే భద్రతా కమిషనర్(సీఆర్‌ఎస్) సమర్పించిన విచారణ నివేదిక బహనాగా బజార్ స్టేషన్ వద్ద జరిగిన ప్రమాదానికి సిగ్నలింగ్ సమస్యలతో సహా అనేక మానవ లోపాలను ఎత్తి చూపింది. దీని ఆధారంగా రైల్వేశాఖ అధికారులు.. బాధ్యులుగా భావిస్తున్న వారిని విధుల నుంచి తొలగించినట్లు తెలుస్తోంది. సీఆర్‌ఎస్ విచారణ పట్ల పలు రాజకీయ పక్షాలు విశ్వసనీయత ప్రదర్శించిన విషయం తెలిసిందే. రైలు దుర్ఘటనల్లో ఈ వర్గం విచారణ అత్యంత పారదర్శకతతో అనుబంధ లోటుపాటులను పటిష్టంగా ఖరారు చేయగలుగుతుందని పలు వర్గాల్లో నమ్మకం బలపడి ఉంది. సీబీఐ విచారణ నేరపరమైన ప్రమేయాన్ని వెలికి తీయగలుగుతుంది. రైల్వే శాఖా పరమైన అంశాలను రైల్వే భద్రతా కమిషనర్ విచారణ తేటతెల్లం చేస్తుందని విశ్వసిస్తున్నారు. ఈ విచారణ పూర్తయి, కేంద్ర ప్రభుత్వానికి నివేదిక దాఖలు చేయడం పూర్తయ్యింది. సీఆర్‌ఎస్ విచారణ మానవ తప్పిదపరమైన లోపాలు ఘోర దుర్ఘటనను ప్రేరేపించాయని స్పష్టం చేసింది. ఆగ్నేయ రైల్వే జనరల్ మేనేజర్ అనీల్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ.. 'ప్రమాదానికి దారితీసిన కారణాలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ) దర్యాప్తు చేస్తోంది. ఈ వర్గం నివేదిక కోసం వేచి ఉన్నాం. మరోవైపు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏడుగురు రైల్వే ఉద్యోగుల వ్యతిరేకంగా శాఖాపరంగా చర్యలు తీసుకోవడం జరిగింది. వీరు విధి నిర్వహణలో మరింత అప్రమత్తంగా ఉంటే ప్రమాద నివారణ సాధ్యమయ్యేదని భావిస్తున్న'ట్లు పేర్కొన్నారు.

### ఆలస్యంగా రైళ్లు..

భువనేశ్వర్: దక్షిణాది ప్రాంతాల మధ్య రాకపోకలు చేస్తున్న పలు ప్రయాణికుల రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో తిరుగు ప్రయాణంలో బయల్దేరాల్సిన స్టేషన్ వేళలను సవరించి, సర్దుబాటు చేసి నడిపిస్తున్నట్లు రైల్వేశాఖ తెలిపింది. బుధవారం షాలీమార్ నుంచి బయల్దేరాల్సిన 12841 అప్ షాలీమార్–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు నిర్ధారిత సమయం మధ్యాహ్నం 3.20 గంటలు కాగా సాయంత్రం 5 గంటలకు బయలు దేరుతుందని ప్రకటించారు. బుధవారం రాత్రి 11.55 గంటలకు హౌరా నుంచి బయల్దేరాల్సిన 12839 అప్ హౌరా–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ మెయిల్ గురువారం ఉదయం 5 గంటలకు ఆలస్యంగా బయలు దేరుతుందని ప్రకటించారు. బుధవారం ఉదయం 10.35 గంటలకు బయలుదేరాల్సిన 12864 డౌన్ ఎస్‌వీఎంటీ బెంగుళూరు–హౌరా ఎక్స్‌ప్రెస్ వేళలు సవరించి మధ్యాహ్నం 1గంటకు ఆలస్యంగా నడిపించినట్లు తెలిపారు.





### సేవలు పొడిగింపు

- ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా విశాఖ–కాశీ వీక్లీ రైలు కొనసాగింపు

భువనేశ్వర్: ప్రయాణికుల ఆసక్తి దృష్ట్యా విశాఖపట్నం–బనారస్(కాశీ) మధ్య నడుస్తున్న వీక్లీ ప్రత్యేక రైళ్ల సేవలను పొడిగించినట్లు తూర్పు కోస్తా రైల్వే ప్రకటించింది. ఈ రైళ్లలో ద్వితీయ శ్రేణి ఎయిర్ కండిషన్–1, తృతీయ శ్రేణి ఎయిర్ కండిషన్–3, స్లీపర్ శ్రేణి–12, సాధారణ శ్రేణి–2, ద్వితీయ శ్రేణి కమ్ లగేజీ, దివ్యాంగుల కోచ్‌లు–2 సౌకర్యం అందుబాటులో ఉంటాయి. ఇది విశాఖపట్నం, బనారస్ స్టేషన్ల మధ్య సింహాచలం, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగుడ, కెసింగ, టిట్లాగఢ్, బొలంగీర్, బర్‌గఢ్ రోడ్, సంబల్‌పూర్, ఝార్సుగుడ, రౌర్కెలా, హతియా, రాంచీ, మూరి, బర్కకానా, లాతేహర్, డాల్తోగంజ్, గర్వా రోడ్, డెహ్రీ ఆన్ సోన్, ససారాం, భబువా రోడ్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, వారణాసి స్టేషన్లలో ఆగుతుంది.

- 08588 విశాఖపట్నం–బనారస్ వీక్లీ స్పెషల్ రైలు జూలై 19నుంచి ఆగస్టు 30 వరకు ప్రతి బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 4.30 గంటలకు బనారస్ చేరుకుంటుంది.
- తిరుగు ప్రయాణంలో 08587 బనారస్–విశాఖపట్నం వీక్లీ స్పెషల్ జూలై 20 నుంచి ఆగస్టు 31 వరకు ప్రతి గురువారం ఉదయం 6 గంటలకు బనారస్ నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 8.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ క్రమంలో ఉభయ దిశల్లో ఈ రైళ్లు 7 సార్లు రవాణా అవుతాయి.

## ఉత్తమ మత్స్యకారుడిగా చక్రధర్ పట్నాయక్



ఉత్తమ మత్స్యకారుడిగా అవార్డు స్వీకరిస్తున్న చక్రధర్ పట్నాయక్



చెరువులో చేప పిల్లలు వదులుతున్న దృశ్యం

మల్కన్‌గిరి: స్వయం ఉపాధి సంకల్పంతో చేపల పెంపకంలో పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న మల్కన్‌గిరికి చెందిన ఎస్.చక్రధర్ పట్నాయక్ జాతీయ ఉత్తమ మత్స్యకారుడిగా అవార్డు సాధించారు. గతంలో జిల్లా మత్స్యశాఖ సిఫార్సు మేరకు రాష్ట్రస్థాయి జరిగిన ఎంపికలో ఆయన మొదటి స్థానంలో నిలిచారు. అనంతరం జరిగిన జాతీయస్థాయి ఎంపికలో సైతం సత్తాచాటారు. ఈ మేరకు అవార్డును బుధవారం స్వీకరించారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. చక్రధర్‌కు 5ఎకరాల భూమి ఉండగా, ఆయన తండ్రి అప్పట్లో దానిని కౌలుకు అప్పగించారు. ఈ నేపథ్యంలో చేపల పెంపకంపై ఆసక్తి కలగడంతో తన సోదరులు దుర్గా పట్నాయక్, సురేష్ పట్నాయక్‌తో చర్చించి అంగీకారం పొందారు. జిల్లా మత్స్యశాఖ అధికారి నర్సింగ్ ముండే సహకారంతో ప్రభుత్వం నుంచి రాయితీ పొందడంతో 2021లో మల్కన్‌గిరి సమితి ధనిగూడ, సింధీర్‌మాల గ్రామాల మధ్య ఉన్న తన సొంత భూమిలో చేపల చెరువు ఏర్పాటు చేశారు. నాలుగు ఆనకట్టలు చేసి, అందులో జల పుష్పాలను వదిలి, అభివృద్ధి పరిచారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎవరూ సాధించని విధంగా అధిక లాభాలు ఆర్జించడంతో పాటు చేప పిల్లలను సైతం ఉత్పత్తి చేస్తూ జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను అభినందిదంచిన జిల్లా మత్స్యశాఖ అధికారి నర్సింగ్.. అవార్డును అందజేశారు. రానున్న రోజుల్లో చెరువు వద్దే మేకలు, కోళ్లఫాం కూడా ఏర్పాటు చేస్తానని ఈ సందర్భంగా అవార్డు గ్రహీత పేర్కొన్నారు.

### కేసీసీబీ డిప్యూటీ రిజిస్ట్రార్ హఠాన్మరణం



సీహెచ్ భవానీప్రసాద్(ఫైల్)

కొరాపుట్: కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ డిప్యూటీ రిజిస్ట్రార్ డీఆర్‌సీఎస్ సీహెచ్ భవానీప్రసాద్ హఠాత్తుగా తుదిశ్వాస విడిచారు. నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. సాయంత్రం అనారోగ్యానికి గురవ్వడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ప్రసాద్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతి పట్ల కేసీసీ బ్యాంక్ అధికారులు, డైరెక్టర్లు, సిబ్బంది సంతాపం ప్రకటించారు.

## మునిగుడ పోలీస్ స్టేషన్ ముట్టడి





పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సురక్షా సమితి సభ్యులు

- ఆదివాసీలపై పోలీసుల చర్యలకు వ్యతిరేకంగా ఆందోళన

రాయగడ: జిల్లాలోని మునిగుడ పోలీస్ స్టేషన్‌ను నియమగిరి సురక్షా సమితి ప్రతినిధులు బుధవారం ముట్టడించారు. మునిగుడ సమితి నియమగిరి పర్వత ప్రాంతాలో నివసిస్తున్న అమాయక డొంగిరియా తెగకు చెందిన ఆదివాసీలపై పోలీసులు తప్పుడు కేసులు బనాయించి, అరెస్టులు చేయడంతో పాటు వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు నిరసన వ్యక్తం చేస్తూ నియమగిరి సురక్షా సమితికి చెందిన డొంగిరియాలు తమ సంప్రదాయ ఆయుధాలతో మునిఖోల్ గ్రామం నుంచి ఊరేగింపుగా మునిగుడ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా సురక్షా సమితి కన్వీనర్ లింగరాజ్ ఆజాద్, ఉపాధ్యక్షుడు దొధి పుషికా మాట్లాడారు. గత కొద్ది రోజులుగా నియమగిరి కొండలపై నివసిస్తున్న వారిని తప్పుడు కేసులతోఅరెస్ట్ చేస్తున్నారని విమర్శించారు. రాత్రి సమయంలో గ్రామాలకు చేరుకున్న పోలీసులు ఇంట్లో నిద్రిస్తున్న వారిని సైతం ఎత్తుకు వెళ్లి, చిత్రహింసలకు గురి చేస్తున్నారన్నారు. 3రోజుల క్రితం మునఖోల్ పంచాయతీలోని డెంగుని గ్రామానికి చెందిన బొలి కొరొకొరియాను ఎత్తుకు వెళ్లిన పోలీసులు.. ఉద్దేశ పూర్వకంగా నానా హింసలు పెడుతున్నారని దుయ్యబట్టారు. ఇదే విషయమై జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ, ఎస్‌డీపీఓ, మునిగుడ పోలీస్ స్టేషన్ అధికారిని ప్రశ్నించినా సరైన సమాధానం చెప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేసి, బాధితులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు లేకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో సురక్షా సమితికి చెందిన దస్తారు కద్రక, సాయిబు పుషిక, కలహండి జిల్లా ఖంటువాలోమాలి సురక్షా సమితి కార్యదర్శి బ్రిటీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అధునాతన సౌకర్యాలు



ఖుర్దారోడ్‌లో అందుబాటులోకి వచ్చిన అధునాతన యాంత్రిక సౌకర్యం

- ఖుర్దారోడ్ మెమూ కార్ షెడ్‌లో మరమ్మతులకు ప్రత్యేక చర్యలు

భువనేశ్వర్: తూర్పుకోస్తా రైల్వే ఖుర్దారోడ్ రైల్వే డివిజన్ నిర్వహణ రంగంలో అధునాతన యాంత్రిక సౌకర్యాన్ని ప్రవేశ పెట్టింది. 30టన్నుల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ క్రేన్‌తో భారీ మరమ్మతు తనిఖీ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించింది. మరిన్ని ఆధునిక పారిశ్రామిక ర్యాక్‌లతో కూడిన స్టోర్ డిపోను ఈ సందర్భంగా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమానికి స్థానిక డీఆర్‌ఎం రింకేష్ రాయ్, కల్యాణ్ పట్నాయక్, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్(ఆపరేషన్), సుభ్రజ్యోతి మండల్, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్(ఇన్‌ఫ్రా), ఆర్‌వీఎన్‌ఎల్ జనరల్ మేనేజర్ బీకే రాయ్, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్(ఆపరేషన్స్) అలోక్‌రంజన మహంతి తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. కొత్తగా ప్రారంభించిన 30 టన్నుల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ క్రేన్‌తో భారీ మరమ్మతు తనిఖీ ఇతరేతర అనుబంధ కార్యకలాపాలు సులభతరం అవుతాయని డీఆర్‌ఎం తెలిపారు. ట్రాక్షన్ మోటార్ మార్పిడి, బోగీలు, చక్రాల మార్పిడి వంటి భారీస్థాయి మరమ్మతుల నిర్వహణకు ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. ఆధునిక సాంకేతిక వ్యవస్థ అందుబాటులోకి రావడంతో రిమోట్ కంట్రోల్ సాయంతో రైలు బోగీలను 4 మీటర్ల ఎత్తు వరకు పైకెత్తి, 100 మీటర్ల వరకు సునాయాసంగా జరిపేందుకు వీలవుతుంది. 36 మెమూ రైళ్ల రవాణాలో వినియోగిస్తున్న 17ర్యాక్‌ల నిర్వహణ కార్యకలాపాలు ఖుర్దారోడ్ మెమూ షెడ్‌లో నిర్వహిస్తున్నారు. ఈ సేవలు మరింత విస్తరించాలని డీఆర్‌ఎం ప్రోత్సహించారు.

## ఏనుగు దాడిలో గిరిజనుడి మృతి

- రాత్రంతా మంటలు వేస్తూ జాగరణ చేసిన గ్రామస్తులు

కొరాపుట్: ఏనుగు దాడిలో గిరిజనుడు మృతిచెందిన ఘటన తెంతులకుంటి సమితిలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి నవరంగ్‌పూర్ జిల్లా అటవీశాఖ అధికారులు వివరాలను బుధవారం ప్రకటించారు. మంగళవారం సాయంత్రం తెంతులకుంటి సమితి కొంటాగాం గ్రామానికి చెందిన బుద్ధన్ సౌర(60), సునా దిశారి సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లారు. సమీపంలోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దు నుంచి హఠాత్తుగా వచ్చిన ఏనుగు.. దాడి చేసింది. దీంతో వారిద్దరూ భయంతో పరుగులు తీయగా, బుద్ధన్‌పై దాడి చేసిన గజరాజు కాలితో తొక్కి హతమార్చింది. తప్పించుకున్న సునా దిశారి గ్రామంలోకి వెళ్లి, గ్రామస్తులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. సిబ్బంది బాధిత గ్రామానికి చేరుకుని, భద్రతా చర్యలు చేపట్టారు. ఏనుగు గ్రామంలోకి రాకుండా అంతా మూకుమ్మడిగా కాపలా కాస్తూ, చుట్టూ మంటలు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున శబ్దాలు చేస్తూ రాత్రంతా జాగరణ చేశారు. ఉదయం అడవిలోకి వెళ్లి, మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. సమీపంలో ఏనుగు పాద ముద్రలను గుర్తించారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. వాస్తవానికి నవరంగ్‌పూర్ జిల్లాలో గజరాజుల సంచారం లేదు. పక్కనే ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి కలహండి అడవుల మీదుగా ఏనుగు ప్రవేశించినట్లు అటవీశాఖ అధికారులు ధ్రువీకరించారు. బుధవారం రోజంతా అటవీ ప్రాంతంలో దీని ఆచూకీ కోసం గాలించారు. వచ్చిన తోవలోనే తిరిగి వెళ్లిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ ఘటనతో తెంతులకుంటి సమితి పరిసర గ్రామాల్లో భయాందోళన నెలకొన్నాయి.



బుద్ధన్ సౌర మృతదేహాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు



ఏనుగు భయంతో సామూహికంగా జాగరణ చేస్తున్న కొంటాగాం గ్రామస్తులు

## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి భిజా గ్రామం సమీపంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు అదుపు తప్పడంతో సమీపంలోని లోయలోకి పడిపోయారు. భిజా గ్రామానికి చెందిన మధు ఒటాలా(70), మొటు మినియాక(35) తమ గ్రామం నుంచి మంగళవారం మధ్యాహ్నం కల్యాణ సింగుపూర్‌కు బైక్‌పై వెళ్లారు. పనులు ముగించుకుని రాత్రి 8 గంటల సమయంలో తిరిగి వస్తుండగా వాహనం అదుపు తప్పడంతో లోయలోకి జారి పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని, బాధితులను బయటకు తీశారు. ఇరువురికీ తీవ్రగాయాలు కావడంతో స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు.

### డ్రైనేజీ నిర్మాణానికి సర్వే


పనులకు భూమిపూజ చేస్తున్న ఈఓ సాబోరా

రాయగడ: జిల్లాలోని గుడారి ఎన్‌ఏసీలో డ్రైనేజీ నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్(డిటైల్ ప్రాజెక్టు రిపోర్టు) సర్వే పనులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఎన్‌ఏసీ కార్యనిర్వాహక అధికారి మురళీకృష్ణ పండా ఆధ్వర్యంలో ఎన్‌ఏసీ చైర్మన్ సరిమిత సాబోరా బుధవారం భూమిపూజ చేసి, పనులకు శ్రీకారం చుట్టారు. భువనేశ్వర్‌కు చెందిన సుభద్ర కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఈ డీపీఆర్ సర్వే పనులు చేపట్టనుంది. కార్యక్రమంలో ఎన్‌ఏసీ వైస్ చైర్మన్ బి.జోగేశ్వరరావు, ఇంజినీర్ బిపిన్ బిహారి ప్రధాన్, సంతోష్‌కుమార్ మహంతి, ఎస్.ప్రసాదరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

### జీసీడీ పాఠశాల హెచ్‌ఎంగా నమిత


హెచ్‌ఎం నమితను అభినందిస్తున్న అధికారులు

రాయగడ: స్థానిక పట్టణంలోని గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా నమితా ప్రధాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు జిల్లా అదనపు విద్యాశాఖ అధికారి భజన్‌లాల్ మాఝి ఈ స్థానంలో అదనపు బాధ్యతలు నిర్వహిస్తుండేవారు. హెచ్‌ఎంగా నమితను ఉన్నతాధికారులు నియమించడంతో డిప్యూటీ ఈఓతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి పూర్ణచంద్ర భోరియా, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

### బంగారు చంద్రయాన్


బంగారపు సూక్ష్మచంద్రయాన్

కాశీబుగ్గ : ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న చంద్రయాన్–3 ప్రాజెక్టును పురస్కరించుకుని కాశీబుగ్గకు చెందిన కొత్తపల్లి రమేష్ బుల్లి చంద్రయాన్ నమూనా రూపొందించారు. బంగారంతో తయారుచేసిన ఈ నమూనాను స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

### రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

శ్రీకాకుళం రూరల్ : మండల పరిధిలోని తండేవలస ఆర్టీవో కార్యాలయం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్.ఇందుమతి (18) అనే యువతి మృతిచెందింది. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. సరుబుజ్జిలి మండలం రొట్టవలసకు చెందిన ఇందుమతి ఇటీవలే డిప్లమో పూర్తిచేసింది. తండ్రితో కలిసి శ్రీకాకుళంలో షాపింగ్ చేసేందుకు ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయల్దేరారు. షార్ట్‌కట్ రూట్‌లో తండేవలస నుంచి శ్రీకాకుళం వస్తుండగా ఎదురుగా వెళ్తున్న ట్రాక్టర్ సడన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పి ఢీకొట్టారు. దీంతో యువతి అక్కడికక్కడే మృతి చెందింది. తండ్రి రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస

### అంపైర్ ఎంపికలకు ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంపైర్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్ కుమార్, సీఈవో సంపతరావు సూరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి 28 వరకు చిత్తూరు జిల్లా తిరుపతిలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్–19 బాల బాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల సమయంలో అంపైర్ టెస్ట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 30 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు అర్హులని, వివరాలను 9440255255 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# మత్తుకు ముకుతాడు

- పద్మపూర్‌లో 527 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు
- దమన్‌జోడిలో 1041 కిలోల నిల్వలు ధ్వంసం


గంజాయిని ధ్వంసం చేస్తున్న ప్రాంతంలో ఎస్పీ వివేకానంద శర్మ, అధికారులు

రాయగడ: జిల్లాలో మత్తు పదార్థాల నిల్వలు, రవాణాపై పోలీసులు కఠిన చర్యలకు దిగారు. వాటి ఆగడాలకు అడ్డుకట్ట వేసేలా దాడులు ముమ్మరం చేశారు. ఈ మేరకు లారీలో బియ్యం బస్తాల మధ్య గంజాయిని అక్రమంగా రవాణా చేస్తుండగా పద్మపూర్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించారు. పద్మపూర్ పోలీసుల వివరాల ప్రకారం.. లారీలో అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటలకు కెందుగుడ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో కెందుగుడ మీదుగా పద్మపూర్ వైపు వెళ్తున్న లారీని తనిఖీ చేయగా బియ్యం బస్తాల మధ్య గంజాయి బస్తాలు బయటపడ్డాయి. వీటిని తరలిస్తున్న శివశక్తి రమన్(24), కె.మణి(32), జయప్రకాష్(32) లను అరెస్ట్ చేశారు. 527 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా 500 బస్తాల బియ్యం, రూ.3,100ల నగదు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న గంజయి విలువ సుమారు రూ.21,08,000లు ఉంటుందని అంచనా వేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**నాల్కోలో గంజాయికి నిప్పు..**

జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో కొరాపుట్ జిల్లా ధమన్‌జోడి వద్ద ఉన్న నాల్కో పరిశ్రమలో 1041.52 కిలో గంజాయిని ధ్వంసం చేశామని జిల్లా ఎస్పీ కార్యాలయం ప్రకటించింది. కొద్ది నెలల క్రితం జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన దాడుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయిని ఈ మేరకు నిబంధనల ప్రకారం ధ్వంసం చేశామని వెల్లడించింది. రాయగడ జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ పర్యవేక్షించగా, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

**రూ.10 లక్షల విలువైన..**

రైలులో అక్రమంగా తరలిస్తున్న రూ.10లక్షల విలువైన గంజాయిని రైల్వే పోలీసులు మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి, ఎక్సైజ్‌శాఖ అధికారులకు అప్పగించారు. విశాఖపట్నం నుంచి దుర్గ్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో జనరల్ బోగీల్లోని ప్రయాణికుల సీట్ల కింద బ్యాగుల్లో గంజాయిని తరలిస్తున్నట్లు ఆర్‌పీఎఫ్ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు రైలు రాయగడకు చేరుకునే సరికి బోగీల్లో తనిఖీలు నిర్వహించారు. ఏ–1 బోగీలో గంజాయితో ఉన్న 14 బ్యాగులను గుర్తించారు. అదే బోగీలో ప్రయాణిస్తున్న ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పార్వతీపురం రైల్వే స్టేషన్‌లో వీటిని లోడింగ్ చేసిన నిందితులు, రాయిపూర్‌కు తరలిస్తున్నట్లు దర్యాప్తులో తెలింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గంజాయితో పట్టుబడిన నిందితులు

## 'వీఎస్ఎస్‌యూటీ'లో వాహనాల వినియోగంపై ఆంక్షలు

భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రముఖ విద్యా ప్రాంగణాల్లో మోటారు వాహనాల ప్రమాదాలు తరచూ సంభవిస్తున్నాయి. ఈ విచారకర పరిస్థితుల నివారణ దృష్ట్యా సంబల్‌పూర్ వీర్‌సురేంద్ర సాయి సాంకేతిక విశ్వవిద్యాలయం(వీఎస్ఎస్‌యూటీ) అధికారులు వర్సిటీలో నాలుగు, ద్విచక్ర వాహనాల వినియోగంపై ఆంక్షలు విధించారు. క్యాంపస్‌లో ఉంటున్న విద్యార్థులు ఈ ప్రాంగణంలో వాహనాలను నిలపడం లేదా నడపడం అనుమతించమని స్పష్టం చేశారు. మోటారు వాహనాలకు బదులుగా క్యాంపస్‌లో సైకిళ్లను ఉపయోగించాలని విద్యార్థులకు సూచించారు. ఈ మేరకు వారి తల్లిదండ్రులకు తెలియజేస్తామని వైస్ ఛాన్సలర్ బన్షీధర్ మాఝీ తెలిపారు. ఆంక్షల ఉల్లంఘనకు పాల్పడితే అనుబంధ చర్యలు చేపడతామన్నారు. క్యాంపస్‌లో విద్యార్థులు మోటారు వాహనాలు కలిగి ఉన్నట్లు గుర్తిస్తే అధికార వర్గాలు స్వాధీనం చేసుకుంటారు. ఈ చర్యల్లో సంబల్‌పూర్ జిల్లా అధికార యంత్రాంగం, స్థానిక సిటీ పోలీసుల సహకారం తీసుకుంటామన్నారు. ఇటువంటి పరిస్థితి తలెత్తకుండా హాస్టల్ వార్డెన్లు తాజా ఉత్తర్వులను కట్టుదిట్టంగా అమలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ క్యాంపస్‌లో సుమారు 5వేల మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 3వేల నుంచి 4వేల మంది వరకు వాహనాలను ఉపయోగించడం ముప్పుని ప్రేరేపిస్తుంది. ఇటీవల ఈ క్యాంపస్‌లో ఒక విద్యార్థి ప్రాణాలు కోల్పోగా, మరొక విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ నేపథ్యంలో క్యాంపస్‌లో మోటారు వాహనాలు అవసరం లేదని, విద్యార్థులు చదువుకునేందుకు ఇక్కడికి వస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు అర్థం చేసుకుంటారని వీఎస్ఎస్‌యూటీ అధికార వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి. ఈ మేరకు వాహనాల వినియోగం ఆంక్షల పట్ల పిల్లలకు అవగాహన పరచడంలో సహకరించాలని పిలుపునిచ్చారు.

# ప్రథమ చికిత్సపై శిక్షణ శిబిరం


శిక్షణకు హాజరైన వివిధ కళాశాలల విద్యార్థులు

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని కృష్ణచంద్ర గజపతి స్వయం ప్రతిపత్తి కళాశాలలో యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 3రోజుల ప్రథమ చికిత్స శిక్షణ తరగతులను గంజాం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కన్వీనర్ సుకాంతకుమార్ బెహరా, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిందరావు ప్రారంభించారు. తొలుత రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకులు హెన్రీ డ్యునాంట్ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు రక్తదాన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొవాలని సూచించారు. ప్రతి మనిషి పట్ల సానుభూతి చూపిస్తూ గాయాల పాలైన వారికి సరైన సమయంలో ప్రథమ చికిత్స అందించాలని కోరారు. శిక్షణను విద్యార్థులు సద్వినియోగించుకోవాలని వివరించారు. శిబిరంలో రెడ్‌క్రాస్ అధికారి డాక్టర్ పరమానంద జెన్నా, రామహరి కార్జి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ కన్వీనర్ సుకాంతకుమార్ బెహరా

# గుప్తేశ్వరం అభివృద్ధికి చర్యలు


ఫిబ్రవరి 3న గుప్తేశ్వరాన్ని దర్శించుకుంటున్న 5టీ కార్యదర్శి కార్తికేయ పాండ్యన్

- రూ.20 కోట్లు మంజూరు చేసిన రాష్ట్రప్రభుత్వం

కొరాపుట్: దక్షిణ ఒడిశాలో సహజసిద్ధ శైవక్షేత్రం గుప్తేశ్వరం అభివృద్ధికిక రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనికి అనుగుణంగా రూ.20 కోట్లు మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బుధవారం ఉత్తర్వులు వెల్లడించింది. ఈ మేరకు కొరాపుట్ జిల్లా కలెక్టర్ డాక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తార్ ప్రకటన విడుదల చేశారు. ఫిబ్రవరి 3న సీఎం వ్యక్తిగత సలహాదారుడు, 5టీ కార్యదర్శి వి.కార్తికేయ పాండ్యన్ గుప్తేశ్వరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ, సమీప అటవీ ప్రాంతాల ప్రజలు గుప్తేశ్వరం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఆయన.. సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక(డీపీఆర్) సిద్ధం చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. దీని ఆధారంగా ముఖ్యమంత్రి కార్యాలయం రూ.20 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో గుప్తేశ్వరం గుహల్లో లైటింగ్, శబరి నది ఒడ్డున మెట్లమార్గం నిర్మాణం, కొండ దిగువన విశాలమైన రోడ్డు, మెట్ల పునరుద్ధరణ, స్థానిక దుకాణాలను వేరే చోట శాశ్వతంగా నిర్మించడం, నివాసాల తరలింపు, పూర్తిస్థాయి విద్యుదీకరణ తదితర నిర్మాణాలు యుద్ధ ప్రాతిపదికన చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. ఈ నిర్మాణాల వల్ల దండకారణ్యంలో పర్యావరణానికి ఎటువంటి నష్టం లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.


పాండ్యన్‌కు డీపీఆర్ వివరిస్తున్న కలెక్టర్ అక్తర్(ఫైల్)

### ఆర్‌ఎంపీలను గుర్తించాలని వినతి

అరసవల్లి: గ్రామాల్లో ప్రజలకు వైద్యాన్ని అందిస్తున్న ఆర్‌ఎంపీలను ప్రభుత్వం గుర్తించాలని ఉత్తరాంధ్ర ఆర్‌ఎంపీ వైద్యుల సంఘ అధ్యక్షుడు జంగం జోషి కోరారు. ఈమేరకు డీఎంహెచ్‌వో డాక్టర్ బి.మీనాక్షిని బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో గ్రామీణ వైద్యుల వివరాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఎం.తిరుపతిరావు, చౌదరి శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరెడ్డి, గోవిందరావు, బెహరా రాధిక, ఉమాశంకర్, రాము ఉన్నారు.

### ఆదిత్యుని సన్నిధిలో ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి


ఆదిత్యుని జ్ఞాపికను శివనాథ్‌రెడ్డికి అందజేస్తున్న ఈవో హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని శాసనమండలి సభ్యుడు సీహెచ్ శివనాథ్‌రెడ్డి కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో వి.హరిసూర్యప్రకాష్, అర్చక బృందం గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనాన్ని, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టతను, పర్వదినాల ప్రత్యేకతలను అర్చకులు వివరించారు. ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు ఇప్పిలి క్షేమేంద్ర శర్మ, మాధవశర్మ ఉన్నారు.

### కొండచిలువ కలకలం


హతమైన కొండచిలువ

సోంపేట: మండలంలోని పలాసపురం గ్రామంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల్లో భారీ కొండచిలువ బుధవారం కలకలం రేపింది. నల్ల చెరువులో వేతనదారులు పనులు చేస్తుండగా సుమారు 12 అడుగుల కొండచిలువ బయటకు రావడంతో భయంతో పరుగులు తీశారు. తరువాత కొందరు ధైర్యం చేసి కర్రలతో దాన్ని హతమార్చడంతో వేతనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

### విద్యుత్ కాంట్రాక్టర్‌పై అట్రాసిటీ కేసు నమోదు

టెక్కలి రూరల్: టెక్కలికి చెందిన విద్యుత్ కాంట్రాక్టర్ బెండి శ్రీనుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు టెక్కలి ఎస్‌ఐ–2 రమేష్‌బాబు బుధవారం తెలిపారు. కాంట్రాక్టర్ శ్రీను తనపట్ల దురుసుగా ప్రవర్తించడమే కాకుండా అవహేళన చేస్తూ మాట్లాడుతున్నాడని గూడేం గ్రామానికి చెందిన జూనియర్ లైన్‌మెన్ బుసకల భాస్కరరావు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### దూరవిద్య డిగ్రీకి దరఖాస్తుల ఆహ్వానం

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా దూర విద్యా విధానంలో డిగ్రీలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, కోఆర్డినేటర్ ఎ.రామారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు

# గుణాత్మక విద్య అందించాలి: ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తారాప్రసాద్

జయపురం: పాఠశాలలకు మరమ్మతులు చేపట్టినంత మాత్రాన బాధ్యతలు తీరిపోవని, విద్యార్థులకు గుణాత్మక విద్య అందించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి ఆకాంక్షించారు. 5టీ పథకంలో జయపురం సమితి బలియ పంచాయతీ బమునిగుడ గ్రామంలోని కల్యాణ విభాగ ఉన్నత పాఠశాల, బలియ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఆధునీకరణపై చర్చించేందుకు బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల ఆధునీకరణకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న 5టీ నిధులు సద్వినియోగించాలని సూచించారు. సమావేశంలో జయపురం సమితి చైర్‌పర్సన్ తిలోత్తమ ముదులి, జిల్లా పరిషత్ సభ్యులు అస్తా నాయక్, తౌపతి పట్నాయక్, ప్రభుత్వ ఇంజినీర్ విశ్వనాథ్ పాత్రొ, అదనపు బీడీఓ మనోజ్ నాయక్, సర్పంచ్ సరస్వతీ మాఝి, కలియగాం సర్పంచ్ సబిత ముదులి, బలియ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కల్పనసాహు, కలియగాం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మనీషా పండా, సిబ్బంది పాల్గొన్నారు.

### జనరల్ స్టోర్‌లో చోరీ


దొంగతనం జరిగిన షాపును పరిశీలిస్తున్న క్లూస్ టీం

కంచిలి: కంచిలి మెయిన్ రోడ్డులోని రైల్వేస్టేషన్ కూడలిలో ఉన్న ఓ జనరల్ స్టోర్‌లో చోరీ జరిగింది. ఈ మేరకు యజమాని స్టోర్ యజమాని శాసనపురి రామారావు బుధవారం ఉదయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి స్టోర్‌ను మూసేసి వెళ్లిపోయిన రామారావు.. బుధవారం ఉదయం షాపు తెరిచి చూసేసరికి సామానులన్నీ చిందరవందరగా పడి ఉండటం, పైకప్పుగా ఉన్న రేకుకు రంధ్రం పడి ఉండటాన్ని గమనించారు. క్యాష్ బాక్సులో ఉంచిన సుమారు రు. 50 వేల నగదు, కొన్ని సామానులు చోరీకి గురైనట్టు గుర్తించారు. రేకుకు రంధ్రం చేసి దొంగలు లోనికి ప్రవేశించినట్టు భావిస్తున్నారు. రామారావు ఫిర్యాదు మేరకు బారువ ఎస్సై ఎస్.చిరంజీవి నేతృత్వంలో బుధవారం సాయంత్రం క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించారు.

# మహేంద్రతనయ నదిలో పడి వ్యక్తి మృతి


ఆనందరావు మృతదేహం

పాతపట్నం: మహేంద్రతనయ నదిలో ప్రమాదవశాత్తు పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన పాతపట్నం–కాపుగోపాలపురం మధ్య నీలకంఠేశ్వర ఆలయం సమీపంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకోగా.. సోభ పంచాయతీ కరడసింగిగూడకు చెందిన సవర ఆనందరావు (38) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనందరావు పాతపట్నం నీలకంఠేశ్వర ఆలయం వద్ద మహేంద్రతనయ నదీ కాజ్‌వే వద్దకు బహిర్భుమి కోసం వెళ్లాడు. అయితే ప్రమాదశాత్తు కాలు జారి నదిలో పడిపోయాడు. సమీపంలో ఉన్న యువకులు చూసి నదిలోకి దూకి ఆనందరావును బయటకు తీసుకొచ్చారు. 108 వాహనానికి సమాచారం ఇవ్వగా.. సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ఎస్సై మహమ్మద్ యాసీన్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాతపట్నం సీహెచ్‌సీ తరలించారు. మృతుడికి భార్య సుహాసిని, బాబు అంజనేయులు ఉన్నారు.

# సత్తాచాటిన క్రీడా'మణులు'



ఝిల్లి దాల్‌బెహరా


మీనా శాంత


జ్యోత్స్న సబర్

భువనేశ్వర్: దేశ రాజధాని ఢిల్లీలోని గ్రేటర్ నొయిడాలో జరుగుతున్న కామన్‌వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో రాష్ట్రానికి చెందిన క్రీడాకారిణులు సత్తా చాటారు. ఇందులో మీనా శాంత, జ్యోత్స్న సబర్ బంగారు పతకాలు సాధించగా, ఝిల్లి దాల్‌బెహరా రజత పతకం కైవసం చేసుకుంది. 55 కిలోల యువజన వర్గంలో మీనా, 40 కిలోల కేటగిరీలో జ్యోత్స్న విజేతలుగా నిలిచారు. 49 కిలోల సీనియర్ విభాగంలో ఝిల్లి రజతం సొంతం చేసుకుంది.

# హక్కుల సాధనకు సిద్ధం కావాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

హక్కుల సాధన కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, బహుజనలంతా ఉద్యమానికి సిద్ధం కావాలని జాతీయ బీసీ సంఘ నాయకుడు బోడే రామచంద్ర యాదవ్ పిలుపునిచ్చారు. దీనికోసం రాష్ట్రంలో నూతన రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పెద్దపాడు రోడ్డులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం ప్రజా సింహగర్జన సన్నాహక సభ నిర్వహించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బహుజనుల ఐక్యత, హక్కుల సాధన కోసం చర్చించారు. ఈ సందర్భంగా రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ.. పాలిస్తున్న రాజకీయ పార్టీలన్నీ వారి వారి స్వార్థపూరిత అభివృద్ధికి ప్రయత్నిస్తున్నాయే తప్ప ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ నెల 23న మంగళగిరిలో జరిగే రాష్ట్ర స్థాయి సభకు బడుగు బలహీన వర్గాల ప్రజాప్రతినిధులందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కాగితాపు వెంకటరమణ, పానిలా ప్రసాద్, ఇప్పిలి చిన్న, పిట్ట చంద్రపతిరావు, కంఠ వేణు, జాడ శ్రీను, కలగ కన్నం నాయుడు, ముద్దాడ రాజశేఖర్, గద్దిబోయిన కృష్ణ, ఎం.శ్రీనివాసరావు, నారాయణరావు చౌదరి పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

# 19కల్లా జీడి పరిశ్రమలు తెరుస్తాం


మాట్లాడుతున్న పీసీఎంఏ అధ్యక్షుడు మల్లా సురేష్

కాశీబుగ్గ: కొద్దిరోజులుగా మూసివేసిన జీడి పరిశ్రమలను ఈ నెల 19 నాటికి తెరిచేందుకు చర్యలు చేపడుతున్నామని పలాస కాష్యూ మాన్యుఫేక్చర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లా సురేష్ తెలిపారు. పలాస పీసీఎంఏ భవనంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు, రైతుల పరిస్థితిని గుర్తించిన మంత్రి సీదిరి అప్పలరాజు యాజమాన్యాలతో మాట్లాడారని చెప్పారు. జీడి పిక్కలు పండిస్తున్న అన్ని ప్రపంచ దేశాల్లో ఈఏడాది పంట దిగుబడి ఎక్కువ కారణంగా ధర తక్కు పలుకుతోందన్నారు. విదేశాల నుంచి జీడి పప్పు మన దేశానికి భారీ మొత్తంలో దిగుమతి అవుతుండటమూ కారణమేనని తెలిపారు. ఈ పరిణామాలతో జీడి పప్పు ఉత్పత్తిని ఆపాల్సి వచ్చిందన్నారు. దీనిని రాజకీయం చేయవద్దన్నారు. రైతులు అర్థం చేసుకుని సహకరించాలని కోరారు. సమావేశంలో కోశాధికారి పట్నాల రవికాంత్, పారిశ్రామికవాడ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు, కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, హరిపురం సంఘ సభ్యులు శ్రీనివాసరావు, మందస సంఘం సభ్యులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఇండియన్ బ్యాంకు 48వ శాఖ ప్రారంభం



ఇండియన్ బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్న హైదరాబాద్ ఫీల్డ్ జీఎం గణేశరామన్

విజయనగరం టౌన్: పట్టణంలోని కె.ఎల్.పురం వద్ద విశాఖ జోన్ ఇండియన్ బ్యాంక్ 48వ శాఖ బుధవారం ప్రారంభమైంది. హైదరాబాద్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ ఎ.గణేశరామన్ ఈ నూతన శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.10 లక్షల కోట్లు దాటిందన్నారు. బ్యాంకింగ్‌కు సంబంధించి అన్ని ప్రామాణికతలలో ఎఫ్ఎంజీ, హైదరాబాద్ మొదటి స్థానంలో ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ సి.హెచ్.వెంకటరమణ, విజయనగరం మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పట్టపగలే చోరీ

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేట గ్రామానికి చెందిన వృద్ధురాలి మెడలో బంగారం పుస్తెలతాడు దొంగలించిన సంఘటన బుధవారం పట్టపగలే చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. అప్పయ్యపేట గ్రామానికి చెందిన బురిడి సరోజిని భర్తతో కలసి యూనియన్ బ్యాంక్‌కు మధ్యాహ్నం వచ్చారు. బ్యాంక్ పని చూసుకుని బ్యాంక్ నుండి స్వగ్రామం అప్పయ్యపేట వెళ్లడానికి ఆటో స్టాండ్‌కు వచ్చారు. మహిళను చూసి అప్పయ్యపేట వైపు వెళ్తున్నట్లు ఆటో నమ్మించి ఎక్కించారు. అప్పయ్యపేట మెయిన్ రోడ్డు దగ్గర ఆటో ఆపకుండా గ్రామ శివారున వేగంగా ఆటో నుండి దించి వెళ్లిపోయాడు. ఆటో దిగే తొందరలో దిగిన వెంటనే తన మెడలో పుస్తెలతాడు కనిపించడం లేదని గుర్తించి గొల్లుమంది. పుస్తెల తాడు పోయిందని గ్రామ పెద్ద బి.సూర్యనారాయణకు తెలియజేసింది. సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.నీలకంఠం కేసు నమోదు చేశారు.

### గోడ కూలి వ్యక్తి దుర్మరణం

విజయనగరం క్రైమ్: ప్రమాదవశాత్తు గోడ కూలి వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన బుధవారం పట్టణంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి టూ టౌన్ సీఐ సీహెచ్ లక్ష్మణరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్ల మండలం జమ్మపేటకు చెందిన పత్తికాయల అప్పలనర్సయ్య (52) కోట్లమాదప్ప వీధిలో పాడుపడిన భవనం తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు గోడ కూలిపోయింది. ఈ ఘటనలో అప్పలనరసయ్య తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలున్నారు. టూటౌన్ ఏఎస్ఐ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పార్వతీపురం: సీతానగరం మండలం నిడగల్లు గ్రామానికి చెందిన గొట్టాపు తాతబాబు(35)కు గత 15 రోజుల నుండి ఆరోగ్యం బాగాలేక మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన విషయం విదితమే. ఈ మేరకు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఈయనకు భార్యతో పాటు పిల్లలున్నారు. ఈ మేరకు అవుట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పిడుగు పడి ఎద్దు మృతి



కోడిశలో పిడుగు పడి మృతి చెందిన ఎద్దు

రేగిడి : మండలంలోని కోడిశ గ్రామంలో పిడుగుపడి బుధవారం ఎద్దు మృతి చెందింది. రైతు సత్యవరపు దాలప్పయ్య తన ఎద్దులను మేతకు తీసుకుని పొలానికి వెళ్లగా, ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. ఈ సమయంలో పిడుగు పడడంతో ఎద్దు మృతి చెందింది. రూ.50 వేల విలువ చేసే ఎద్దు మృతి చెందడంతో రైతు లబోదిబోమంటున్నాడు.

### విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యాబోధన

పాలకొండ: విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యను బోధించాలని, పాఠశాల స్థాయిలో గట్టి పునాది వేయాలని డీఈఓ ప్రేమ్‌కుమార్ సూచించారు. పాలకొండ డివిజన్ పరిధిలోని ఎంఈఓలు, హెచ్ఎంలతో పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాప్రణాళికపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం సరఫరా చేసిన జగనన్న విద్యాకానుకలను విద్యార్థులందరికీ అందజేయాలన్నారు. నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, ఫేజ్-2లో పనుల కోసం అంచనాలు వెంటనే అందించాలని సూచించారు. పాఠశాలల్లో రుచికరమైన భోజనం వడ్డించేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

# ఇంటింటా... ఫీవర్ సర్వే





పార్వతీపురం మండలం దోకిశీల గిరిజన గ్రామంలో ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

- వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం
- ముందస్తు చర్యలతో వ్యాధుల వ్యాప్తి కట్టడికి సర్కారు సన్నద్ధం
- 1150 బృందాలతో ఫీవర్ సర్వే
- జిల్లాలోని 37 పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలలో రక్తపరీక్షలు
- లక్షణాలు ఉంటే మలేరియా, డెంగీ పరీక్షలు

పార్వతీపురంటౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, నైరుతి రుతుపవనాల ప్రభావంతో పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరుతోంది. దోమలు, బ్యాక్టీరియా వృద్ధిచెంది వ్యాధుల వ్యాప్తి చెందే పరిస్థితి ఉండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజారోగ్యమే లక్ష్యంగా.. వ్యాధుల వ్యాప్తిని కట్టడి చేసేందుకు, రోగులకు సకాలంలో వైద్య సేవలందించే చర్యలు ప్రారంభించింది. ఓ వైపు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూనే.. ఇంటింటి ఫీవర్ సర్వేకు బుధవారం శ్రీకారం చుట్టింది. ఆశ, ఏఎన్ఎం, వలంటీర్లతో కూడిన 1150 బృందాలు గ్రామాల్లో జ్వర పీడితుల గుర్తింపు సర్వే చేస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో అక్కడక్కడ సాధారణ జ్వరాల కేసులు నమోదువుతున్నాయి. ఈ నేపథ్యంలో వర్షాకాలంలో సోకే వ్యాధులు, వాటి లక్షణాలను, జాగ్రత్తలను వైద్య బృందాలు వివరిస్తున్నాయి. ప్రజలను అప్రమత్తం చేస్తున్నాయి.

**జ్వరపీడితులకు తక్షణ పరీక్షలు**

జిల్లాలో ఫీవర్ సర్వేలో జ్వరం ఉన్న వారిని బృందాలు గుర్తిస్తున్నాయి. ప్రాథమిక వైద్యం అందించడంతో పాటు వైద్యంకోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలిస్తున్నాయి. అవసరమైన వారికి ప్రభుత్వాస్పత్రుల్లో మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాలో సాధారణ జ్వర లక్షణాలు మాత్రమే అక్కడక్కడ కనిపిస్తున్నాయని వైద్యాధికారులు చెబుతున్నారు.

**సర్వే ఇలా...**

జిల్లాలో చేపట్టిన ఫీవర్ సర్వేలో 1553 మంది ఆశవర్కర్లు, 364 మంది ఏఎన్ఎంలు నిమగ్నమయ్యారు. తొలిరోజు 2,600 ఇళ్లను సర్వే చేశారు. గ్రామాల్లో జ్వరాల కేసులు ఎక్కువగా నమోదువుతున్నట్టు సర్వేలో తేలితే వెంటనే ఆయా గ్రామాలు, ప్రాంతాల్లో వైద్య శిబిరాల ఏర్పాటు చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.

| జిల్లాలో ఫీవర్ సర్వే ఇలా.. | |
|---|---|
| మండలాలు | 15 |
| సచివాలయాలు | 350 |
| పీహెచ్‌సీలు | 37 |
| యూహెచ్‌సీలు | 5 |
| ఆవవర్కరు | 1553 |
| ఏఎన్ఎంలు | 364 |
| ఫీవర్ సర్వే బృందాలు | 1150 |

### గ్రామాల్లో చురుగ్గా ఫీవర్ సర్వే



ప్రస్తుతం సీజనల్ వ్యాధులు సోకే సమయం కావడంతో జిల్లాలో ఫీవర్ సర్వే చురుగ్గా జరుగుతోంది. 1150 బృందాలు సర్వే చేస్తున్నాయి. జ్వరం కేసులు ఉంటే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారించి సకాలంలో చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. జ్వరాలు ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం. ప్రజలు వర్షకాలంలో స్వచ్ఛమైన నీరు, వేడి ఆహారం తీసుకోవాలి. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలి.

– డాక్టర్. బి జగన్నాథరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, పార్వతీపురం మన్యం

# బీసీలంతా ఐక్యం కావాలి



సభలో ప్రజా సింహగర్జన పోస్టర్‌ను విడుదల చేస్తున్న బీసీ నాయకులు

విజయనగరం టౌన్: రాజ్యాధికారాన్ని సాధించేందుకు బీసీలంతా ఐక్యం కావాలని రాష్ట్ర బీసీ సంఘం నాయకుడు బోడె రామచంద్ర యాదవ్ పిలుపునిచ్చారు. బీసీల రాజ్యాధికారం లక్ష్యంతో ఆయన నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా బుధవారం విజయనగరం వచ్చిన ఆయనకు స్థానిక బీసీ నాయకుడు ఇశరపు శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. స్థానిక మెసానిక్ టెంపుల్‌లో జరిగిన బీసీ సింహగర్జన సభలో రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 85 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల ఓట్లతో అగ్రకులాలు దశాబ్దాలుగా పరిపాలన సాగిస్తున్నాయన్నారు. వీరిని ఓటు బ్యాంకుగా వినియోగించుకుంటున్న అగ్రకులాలు వారి సంక్షేమానికి మాత్రం కృషి చేయడం లేదని తీవ్రంగా విమర్శించారు. ఈ పరిస్థితి మారాలంటే బీసీల నాయకత్వంలో రాజ్యాధికారం రావాలని పిలుపునిచ్చారు. బీసీ నాయకుడే ముఖ్యమంత్రి కావాలని సూచించారు. ఈ పరిస్థితుల్లో కొత్త పార్టీ ఆవిర్భవించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ నెల 23న కొత్త పార్టీ ఆవిర్భావ సభకు ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇసరపు శేఖర్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సభలో బీసీ నాయకులు జాగరపు ఈశ్వర ప్రసాద్, మన్నాల కృష్ణ, దువ్వ చిన్నయ్య, గదుల వెంకటరావు, గోపాలరావు, రమణ, తుమ్మి లక్ష్మీరాజ్యం, ముల్లు వెంకటరమణ, విజయవాడ కార్పొరేటర్ మల్లికార్జునరావు, బండి సత్యంనాయుడు, ఇప్పిలి రాములప్పడు తదితరులు పాల్గొని ప్రసంగించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బీసీ నాయకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# అ'పూర్వ' కలయిక



రాజాంలో 47 సంవత్సరాల తరువాత కలుసుకున్న విశ్రాంత ఉపాధ్యాయులు

రాజాం సిటీ: ఆరు పదులు దాటిన విశ్రాంత ఉపాధ్యాయుల అపూర్వ కలయికకు రాజాంలోని ఓ కల్యాణ మండపం బుధవారం వేదికైంది. 47 ఏళ్ల క్రితం ఉపాధ్యాయ శిక్షణ అనంతరం ఉపాధ్యాయులుగా స్థిరపడి ఉద్యోగ విమరణ కూడా చేశారు. ముందుగా అనుకున్న ప్రకారం తేదీ నిర్ణయించుకుని ఆరు జిల్లాల్లో ఉన్న స్నేహితులంతా ఇక్కడకు చేరుకున్నారు. 1976 – 77 సంవత్సరంలో ఒమరవిల్లి డైట్ కళాశాలలో టీచర్ ట్రైనింగ్ పొందిన ఉపాధ్యాయులంతా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నో ఏళ్ల తరువాత కలుసుకున్న స్నేహితులంతా ఉద్వేగంతో ఒకరినొకరు పలకరించుకుని ఆనందంగా గడిపారు. ఉపాధ్యాయ వృత్తిలో అనుభవాలను నెమరవేసుకుంటూ పిల్లలు, వారి చదువులు, ఉద్యోగాలు వంటి అంశాలపై యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఒక ట్రస్టు ఏర్పాటు చేసి భవిష్యత్తులో ప్రజాసేవ చేసేందుకు అంతా నిర్ణయించారు. నాటి స్నేహితులతో కలసి రోజంతా సరదాగా గడిపారు. ప్రతి ఏడాది ఇలా కలుసుకుని భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు అప్పలాచారి, సత్యం, గౌరీశ్వరరావు, అసిరినాయుడు, లక్ష్మీనారాయణ, రాజారావు, గౌరీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### సేవలు పొడిగింపు

- ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా విశాఖ-కాశీ వీక్లీ రైలు కొనసాగింపు

భువనేశ్వర్: ప్రయాణికుల ఆసక్తి దృష్ట్యా విశాఖపట్నం-బనారస్(కాశీ) మధ్య నడుస్తున్న వీక్లీ ప్రత్యేక రైళ్ల సేవలను పొడిగించినట్లు తూర్పు కోస్తా రైల్వే ప్రకటించింది. ఈ రైళ్లలో ద్వితీయ శ్రేణి ఎయిర్ కండిషన్-1, తృతీయ శ్రేణి ఎయిర్ కండిషన్-3, స్లీపర్ శ్రేణి-12, సాధారణ శ్రేణి-2, ద్వితీయ శ్రేణి కమ్ లగేజీ, దివ్యాంగుల కోచ్‌లు-2 సౌకర్యం అందుబాటులో ఉంటాయి. ఇది విశాఖపట్నం, బనారస్ స్టేషన్ల మధ్య సింహాచలం, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగుడ, కెసింగ, టిట్లాగఢ్, బొలంగీర్, బర్‌గఢ్ రోడ్, సంబల్‌పూర్, ఝార్సుగుడ, రౌర్కెలా, హతియా, రాంచీ, మూరి, బర్కకానా, లాతేహర్, డాల్తోగంజ్, గర్వా రోడ్, డెహ్రీ ఆన్ సోన్, ససారాం, భభువా రోడ్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, వారణాసి స్టేషన్లలో ఆగుతుంది.

- 08588 విశాఖపట్నం-బనారస్ వీక్లీ స్పెషల్ రైలు జూలై 19నుంచి ఆగస్టు 30 వరకు ప్రతి బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 4.30 గంటలకు బనారస్ చేరుకుంటుంది.
- తిరుగు ప్రయాణంలో 08587 బనారస్-విశాఖపట్నం వీక్లీ స్పెషల్ జూలై 20 నుంచి ఆగస్టు 31 వరకు ప్రతి గురువారం ఉదయం 6 గంటలకు బనారస్ నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 8.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ క్రమంలో ఉభయ దిశల్లో ఈ రైళ్లు 7 సార్లు రవాణా అవుతాయి.

### కొత్త కౌలు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: కౌలు రైతు చట్టం 1956ను ప్రభుత్వం రద్దు చేసి 2019 నుంచి అమలులోకి తెచ్చిన కొత్త కౌలు రైతుల విధానాన్ని అర్హులైన కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని జేసీ మయూర్ అశోక్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో ఈ మేరకు వివరాలను విడుదల చేశారు. కొత్త కౌలు రైతు విధానం ద్వారా అందజేసే సాగు హక్కు ధ్రువీకరణ పత్రం (సీసీఆర్‌సీ) కోసం అర్హులైన కౌలు రైతులు దరఖాస్తు చేసుకోవాలి. జిల్లాలో 1,076 మంది కౌలు రైతులకు ఇవ్వాలనే లక్ష్యంతో ఉన్నామని, ఇంతవరకు 61 శాతంతో 6,221 మందికి సీసీఆర్‌సీ కార్డులను మాత్రమే జారీ చేసామని, అందువల్ల ఈ నెలాఖరు వరకు గడువు పెంచామని పేర్కొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో కౌలు రైతు కార్డుల జారీ అంశం కూడా ఉందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూయజమాని నుంచి అంగీకార పత్రం, ఆధార్ కార్డు, కౌలు రైతు ఆధార్ కార్డులు తీసుకొని గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి కౌలు కార్డులను పొందవచ్చని సూచించారు.

# ప్రాణం పోసిన ఆరోగ్యశ్రీ

- నవజాత శిశువుకు అరుదైన చికిత్స



చికిత్స పొందుతున్న నవజాత శిశువు(ఫైల్)



శిశువును తల్లిదండ్రులకు అప్పగిస్తున్న అమృత ఆస్పత్రి వైద్యులు

రాజాం : రాజాంలోని అమృత ఆస్పత్రిలో వైద్యులు ఆరోగ్యశ్రీ ద్వారా అరుదైన చికిత్సను అందించి, 9 నెలలు దాటకుండానే పుట్టిన శిశువు ప్రాణాలు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే... సంతకవిటి మండలం అక్కరాపల్లి గ్రామానికి చెందిన కరగాన వసంత గర్భిణి. నెలలు నిండక ముందే పురిటి నొప్పిలతో రాజాంలో అమృత ఆస్పత్రిలో మే 29న చేరింది. అంతకు ముందు పలు ఆస్పత్రిల్లో తిరిగిన ఆమెకు ఫలితం కనిపించలేదు. అమృత ఆస్పత్రి గైనికాలజిస్ట్ గార సూర్యశైలజ వెంటనే స్పందించి స్కానింగ్ ద్వారా బిడ్డ ప్రమాదకరంగా ఉందని భావించి డెలివరీ చేశారు. 800 గ్రాముల బరువుతో ఆడశిశువు జన్మించింది. నెలలు నిండకుండానే 7వ నెలలో ప్రసవం కావడంతో పాటు బరువు కూడా తక్కువగా ఉండడంతో బిడ్డ బ్రతికే పరిస్థితి కుటుంబీకులకు కనిపించలేదు. ఈ సమయంలో ఆస్పత్రి ఎండీ గార రవిప్రసాద్ పర్యవేక్షణలో గైనకాలజిస్ట్‌తో పాటు చిన్నపిల్లల వైద్యులు వావిలపల్లి అప్పలనాయుడులు 44 రోజుల పాటు వైద్యం అందించి శిశువు ప్రాణాలు కాపాడారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యంగా ఉండడంతో పాటు బరువు కూడా కేజీన్నరకు పైగా పెరిగింది. బుధవారం శిశువును తల్లిదండ్రులకు అప్పగించి డిశ్చార్జ్ చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం అందించి తమ బిడ్డ ప్రాణాలు కాపాడిన వైద్యులకు, ప్రభుత్వానికి తండ్రి గౌరీశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళపై దాడి చేసి పుస్తెలతాడు చోరీ



వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ

సీతంపేట: చిల్లర సామాన్లు కొనుగోలు చేయడానికి వచ్చిన ఓ వ్యక్తి దుకాణంలో ఎవరూ లేరని గుర్తించి ఇంట్లో దూరి మహిళపై దాడి చేసి తీవ్రంగా గాయపరచి పుస్తెలతాడు చోరీ చేశాడు. గాయపడిన మహిళ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. బుధవారం జరిగిన ఈ సంఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు... హడ్డుబంగి గ్రామంలో వైశ్యరాజు గోపాలరావు చిన్న దుకాణాన్ని నడుపుకుని కొన్నేళ్లుగా కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఎప్పటిలాగే భార్య శోభారాణిని దుకాణం చూడమని చెప్పి కొత్తూరు సామాన్లు కోసం వెళ్లాడు. ఇంతలో ఒక వ్యక్తి వచ్చి కచోడీలు కావాలని అడగ్గా ఇచ్చి శోభారాణి ఇంట్లోకి వెళ్లిపోయింది. ఇంటి గడియ పెట్టుకుంది. ఇదే అదనుగా కచోడీలు కొనుగోలు చేసేందుకు వచ్చిన వ్యక్తి మెల్లగా గడియ తీసి ఇంట్లోకి దూరి ఆమె మెడలో పుస్తెలతాడు చోరీకి యత్నించగా శోభారాణి అడ్డుకుంది. తీవ్రంగా ప్రతిఘటించింది. దుండగుడు తనతో తెచ్చిన కత్తితో గాయాలు చేశాడు. రాళ్లతో తల, గుండెలపై మోదాడు. పిడిగుద్దులు గుద్దాడు. ఈ సమయంలో అటుగా వెళ్తున్న హడ్డుబంగి ఆశ్రమ పాఠశాలకు చెందిన వంట మనిషి చూసి కేకలు వేసింది. దగ్గరలో ఉన్న మరో దుకాణదారుడిని పిలిచింది. ఇంతలో దుండగుడు మెడలో ఉన్న పుస్తెలతాడును తెంచుకొని పారిపోయాడు. శోభారాణి భర్తకు సమాచారం ఇవ్వగా కొత్తూరు నుంచి హుటాహుటీన వచ్చి రక్తపు మడుగులో చావు బతుకుల మధ్య ఉన్న ఆమెను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు సేవలు చేసి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ మురళీధర్, ఎస్ఐ నీలకంఠరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. డీఎస్పీ ఆస్పత్రికి వచ్చి బాధితురాలి నుంచి వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# ఢిల్లీ బృందం సుడిగాలి పర్యటన



గొల్లాదిలో పర్యటిస్తున్న మినిస్ట్రీ ఆఫ్ జలశక్తి మిషన్ బృందం సభ్యులు

బాదంగి:

ఢిల్లీకి చెందిన మినిస్ట్రీ ఆఫ్ జలశక్తి మిషన్‌కు చెందిన సెక్టార్ నిపుణులు మండలంలో బుధవారం సుడిగాలి పర్యటన జరిపారు. వీరిలో సోమేంద్ర రంజాన్ గంగూలి, సుభాష్‌కుమార్ చౌదరితో కూడిన బృందం మండలంలోని ఆకులకట్ట, పీవీ పేట, రామచంద్రాపురం, పూడివలస, డొంకినవలస, పింద్రంగివలస, కామన్నవలస, గొల్లాది గ్రామాల్లో పర్యటించింది. జలజీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన ఇంటింటికీ కుళాయిల పనితీరు పరిశీలించారు. ప్రజల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా పంచాయతీల్లో సంబంధిత పనుల రికార్డుల నమోదు తీరును పరిశీలించారు. కుళాయిల ఏ విధంగా పని చేస్తున్నాయో మహిళలను అడిగి తెలుసుకున్నారు. కుళాయిలు సక్రమంగా పని చేయడాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల గురించి ఆరా తీశారు. వీరితో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్, ఈఈ రాజన్, డీఈఈ రెడ్డి, ఏఈ ప్రవీణ్‌కుమార్, ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# మాతాశిశు మరణాలు తగ్గించేందుకు కృషి

- మాతృ మరణాలపై జిల్లా సబ్ కమిటీ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి.జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: మాతాశిశు మరణాలు తగ్గించేందుకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. జూన్ నుండి ఇప్పటి వరకు జిల్లాలో సంభవించిన మాతృ మరణాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అధ్యక్షతన సంబంధిత వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో జిల్లా ఆరోగ్య కార్యాలయంలో బుధవారం సబ్ కమిటీ సమీక్ష నిర్వహించింది. సాలూరు, జియ్యమ్మవలస, మక్కువ, కురుపాం మండలాల్లో జరిగిన మాతృ మరణాలపై నిర్వహించిన సమీక్షలో అందుకు గల కారణాలను విశ్లేషించారు. ఆశా, అంగన్‌వాడీ, ఏఎన్ఎం, సూపర్‌వైజర్, వైద్యుల ఆరోగ్య తనిఖీ వివరాలు, పరీక్షలు, పర్యవేక్షణ, ఏఏ ఆస్పత్రులకు రిఫర్ చేశారు, ఏ విధమైన ప్రమాదకర సూచికలు గుర్తించబడ్డాయి తదితర అంశాలను పరిశీలించి అందుబాటులో ఉన్న వైద్య సేవలు ఎంత వరకు వినియోగించడం జరిగిందని ఆరా తీశారు. ఆయా మరణాలకు ముందస్తు చర్యలు, తిరిగి పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన కార్యాచరణలపై ఆదేశాలు ఇచ్చారు. సమావేశంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ బి.వాగ్దేవి, కమిటీ నోడల్ అధికారి డీఐవో డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ విజయపార్వతి, డాక్టర్ వెంకటరమణ, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ నవీన్, గైనకాలజిస్ట్‌లు డాక్టర్ కమలకుమారి, డాక్టర్ శోభారాణి, డాక్టర్ సౌమ్య, డాక్టర్ రోజారాణి, అనస్తీస్ట్ డాక్టర్ రామారావు, డీపీహెచ్ఎన్‌వో ఉషారాణి, వైద్యాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ తరగతులు ప్రారంభం



ఆన్‌లైన్ తరగతులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సన్యాసినాయుడు

నెల్లిమర్ల రూరల్:

మండలంలోని కొండవెలగాడ ప్రాథమిక పాఠశాలలో 3,4,5 తరగతులు చదువుతున్న విద్యార్థులకు బుధవారం నుంచి ఆన్‌లైన్ తరగతులు ప్రారంభమయ్యాయి. జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు ఆన్‌లైన్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సర్కారు పాఠశాలలను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్ది ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించి వారి బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వం బాటలు వేస్తోందన్నారు. ప్రభుత్వం సమకూరుస్తున్న వనరులను వినియోగించుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం పతివాడ త్రినాథ్, ఎంపీటీసీ సభ్యుడు మొయిద అక్కోజీ తదితరులు పాల్గొన్నారు